ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.0

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి


3

బుధవారం 6 నవంబరు 2024

పకడ్బందీగా నిర్వహిస్తాం

» నేటి నుంచి సర్వే » 1,938 మంది ఎన్యూమరేటర్ల నియామకం

» 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా అదనపు కలెక్టర్ కె.గంగాధర్



యాదాద్రి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటా సమగ్ర సర్వే నేటి నుంచి ప్రారంభం కానుంది. సమగ్ర కుటుంబ సర్వేకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు సంబంధించిన సరైన ఆధారాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారు. సమగ్ర కుటుంబ సర్వేతో లబ్ధిదారుల ఎంపిక సులువు అవుతుంది. సర్వే చేసే ప్రాంతాల్లో ఒక రోజు ముందుగానే ప్రజలకు సమాచారం ఇచ్చి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకునేలా అవగాహన కల్పిస్తారు. ఈ సర్వేతో జనాభా లెక్కలతోపాటు సామాజిక, ఆర్థిక స్థితిగతులు తెలుస్తాయి. ఈ నెల 6నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. 15రోజుల పాటు సర్వే పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 2,47,354 ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సమగ్ర కుటుంబ సర్వేపై జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే...

సమగ్ర సర్వేకు 1938మంది నియామకం

సమగ్ర కుటుంబ సర్వేను జిల్లాలో పకడ్బందీగా చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశాం. బుధవారం ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య యాదగిరిగుట్టలోని బీసీ కాలనీలో, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వలిగొండలో, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తుర్కపల్లి మండలంలోని మాదాపూర్‌లో సర్వేను ప్రారంభిస్తారు. జిల్లాలో మొత్తం 2,47,354 ఇళ్లు ఉన్నాయి. సర్వే కోసం వివిధ శాఖల నుంచి మొత్తం 1,938 మందిని నియమించాం. ప్రధాన,ఉప ప్రశ్నలతో కలిపి మొత్తం75 అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. సర్వేలో ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులు 1,249 మంది పాల్గొంటారు. ఒక పూట పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం భోజనం అనంతరం సర్వేలో పాల్గొంటారు. వీరితో పాటు ఎన్యూమరేటర్లు 50 శాతం ఉంటారు. ఎన్యూమరేటర్లలో అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్పీలు, వీఏవోలు, పంచాయతీ కార్యదర్శులు, తదితర ఉద్యోగులను నియమించాం.

సర్వేపై పైలెట్ ప్రాజెక్టు నిర్వహించాం

ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేపై ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టు నిర్వహించాం. ఒక్క కుటుంబంలో వివరాలు సేకరించేందుకు అరగంట పట్టింది. పది ఇళ్ల చొప్పున 15రోజుల్లో ఎన్యూమరేటర్‌సర్వే పూర్తి.

- మిగతా 6వ పేజీలో...



వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు కేవలం ఒక్క రోజే మిగిలి ఉంది. బుధవారం ఓట్ల నమోదుకు చివరి రోజు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి పూర్తి కానుండటంతో తదుపరి ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితాను రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సెప్టెంబరు నెలాఖరున షెడ్యూల్‌ను విడుదల చేసింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ):

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు నేడే ఆఖరు

» సెప్టెంబరు 30 నుంచి ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ

» 5వ తేదీ సాయంత్రం వరకు 19,111ఓట్ల నమోదు

» 23న ముసాయిదా జాబితా » డిసెంబరు 30న తుది జాబితా

సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీ వరకు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపట్టింది. కాగా, మంగళవారం సాయంత్రం వరకు ఉపాధ్యాయ నియోజకవర్గంలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 19,111 ఓట్లు నమోదయ్యాయి. 6వ తేదీన చివరి రోజు కావడంతో ఓట్ల నమోదు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈనెల 23న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించి, దీనిపై అభ్యంతరాలను డిసెంబరు 9వ తేదీ వరకు స్వీకరిస్తారు. అదే నెల 25 వరకు అభ్యంతరాలు పరిశీలించి, డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఇలా ఉంటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఫారం-19 ద్వారా ఆఫ్‌లైన్‌లో స్వీకరించారు. ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. గతంలో...

- మిగతా 4వ పేజీలో...

నేటి నుంచి కుటుంబ సర్వే



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే బుధవారం నుంచి జిల్లాలో ప్రారంభం కానుంది. జిల్లాలోని సుమారు 2.47 లక్షల కుటుంబాల నుంచి సుమారు 9లక్షల మందికి చెందిన 75 వివరాలను ఎన్యూమరేటర్లు సేకరించనున్నారు. ఈ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల బీసీ రిజర్వేషన్లు ఖరారు కానుండడంతో పాటు ప్రభుత్వం నూతనంగా చేపట్టే పథకాలకు ఆధారం కానుంది.ఈ సర్వేలో 1,939 మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొననున్నారు. వీరిలో సుమారు 1,000 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు, 250 మంది బోధనేతర సిబ్బంది, 232 మంది అంగన్ వాడీ టీచర్లు, మిగతా 457 మంది మునిసిపల్, ఎంపీడీవో, తదితర స్థానిక సంస్థల సిబ్బంది ఉన్నారు.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)

» ప్రాథమికపాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటి పూట సెలవులు

» విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు యథావిధిగా మధ్యాహ్న భోజనం

కొన్ని పాఠశాలలకు ఒంటి పూట బడి

సర్వే కొనసాగే మూడు వారాల పాటు విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఒక్క పూట మాత్రమే పాఠశాలలకు వెళ్లనున్నారు. మిగతా పూట సర్వే విధుల్లో వారు పాల్గొంటారు. విధుల్లో లేని ఉపాధ్యాయులు సదరు పాఠశాలలను రెండు పూటలా నడిపిస్తారు. అయితే పాఠశాలలోని అందరు ఉపాధ్యాయులు సర్వే విధుల్లో ఉంటే మాత్రం ఆయా పాఠశాలలు ఒంటిపూట మాత్రమే నడుస్తాయి. ఇదే అంగన్‌వాడీలకు సైతం వర్తించనుంది. జిల్లాలో 901 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో 232 కేంద్రాలు ఒక్క పూటనే నడవనున్నాయి. జిల్లాలో 478 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉండగా, సుమారు 16వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సర్వే విధులు నిర్వహించనున్న 232 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 5,800 మంది లబ్ధిదారులు ఉన్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది సర్వే విధుల్లో ఉంటే ఉదయం పూట పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను నడిపి మధ్యాహ్నం మూసివేస్తారు. ఆయా కేంద్రాల్లో..

- మిగతా 6వ పేజీలో...



సిలబస్‌కు ఆటంకం కలిగించరాదు



ప్రభుత్వ సర్వే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. సర్వే వివరాలతో ప్రభుత్వం ప్రవేశపెట్టే నూతన పథకాలతో పాలన మెరుగవుతుందని ఆశిస్తున్నాం. అదే సమయంలో మూడు వారాల పాటు నడపనున్న ఒంటి పూట బడులతో నష్టపోనున్న సిలబస్‌ను విద్యా సంవత్సరం ముగిసే లోపు పూర్తిచేయాలి.

- కలకొండ భవాని, విద్యార్థి తల్లి, భువనగిరి

న్యూస్ బాక్స్

చేనేత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

చేనేత, జౌళీశాఖ కమిషనర్ శైలజ రామయ్యర్



చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను కలిసిన పద్మశాలి చేనేత కార్మిక సంఘం నాయకులు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేనేత సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చేనేత, జౌళీ శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్ అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లికి చెందిన పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక రమేష్ ఆధ్వర్యంలో కార్యవర్గం సభ్యులు హైదరాబాద్‌లో ఆమెను కలిసి చేనేత సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె వారితో మాట్లాడుతూ రాష్ట్రంలోని చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో భారత భూషణ్, బొమ్మ హరి, రుద్ర సూర్యప్రకాష్, బిట్ల గణేష్, కూరపాటి భాస్కర్, కట్కం శ్యాంసుందర్, పొట్టవేణు, గుండేటి శివరాజు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 8న జిల్లా పర్యటన నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతరావు జిల్లా అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన సందర్భంగా కలెక్టరేట్‌లో అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండాలన్నారు. రోడ్ల మరమ్మతులు, శానిటేషన్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి, భువనగిరి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్ రెడ్డి, ఏసీపీ సైదులు, డీఆర్‌డీవో నాగిరెడ్డి, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మూసీ పునరుజ్జీవ యాత్రకు తరలిరావాలి

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



సంగెంలో సీఎంపాదయాత్ర స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

వలిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పునరుజ్జీవ యాత్రకు స్వచ్ఛందంగా తరలిరావాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని సంగెం గ్రామ మూసీ పరివాహక ప్రాంతంలో ఈ నెల 8న సీఎం రేవంత్‌రెడ్డి పునరుజ్జీవ యాత్రకు సభాస్థలాన్ని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రివేణి సంగమం వద్ద కొలువుదీరిన భీమలింగేశ్వరుని సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు. మూసీ వల్ల ఇబ్బందులు పడుతున్న కులవృత్తుల సమస్యలను తెలుసుకుంటారన్నారు. విషతుల్యమైన మూసీ నది వల్ల రైతులు, గౌడన్నలు, పద్మశాలీలు తదితర వృత్తుల వారితో సీఎం మాటామంతి నిర్వహిస్తారన్నారు. ఈ ప్రాంత ప్రజల సాధకబాధకాలను సీఎంకు తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గతంలో చాలా మంది రైతులు మూసీ ప్రక్షాళనకోసం ఉద్యమాలు చేశారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల కల మూసీ ప్రక్షాళన అని, అది నెరవేరే సమయం దగ్గరకొచ్చిందన్నారు. సీఎం పాదయాత్రకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ రాజేష్‌చంద్ర, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, నాయకులు అనంతరెడ్డి, సహదేవ్, బాలనర్సింహ, సత్తిరెడ్డి, సంజీవరెడ్డి, కిష్టయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రామన్నపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికోసం కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మలగూడెం చెరువుకు 3లక్షల చేపపిల్లలు మంజూరు కాగా మంగళవారం 90వేల చేపపిల్లలను విడుదలచేసి మాట్లాడారు. చెరువులే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకారుల కుటుంబాల్లో సిరులు పండాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతురావు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీపీ రాజేష్‌చంద్ర, మత్స్యకార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్‌బాబు, మత్స్యశాఖ ఏడీ ఎం.రాజారాం, కాంగ్రెస్ నాయకులు జినుకల ప్రభాకర్, పూస బాలకిషన్, గంగుల రాజిరెడ్డి, నంద్యాల భిక్షంరెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, గంగుల కృష్ణారెడ్డి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పుంటికూర శంకరయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగోని వెంకటేశం పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ పోటీలు




వాలీబాల్ క్రీడలో పోటీ పడుతున్న క్రీడాకారులు

భువనగిరి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ కళాశాల 68వ ఎస్‌జీఎఫ్ పోటీలు భువనగిరిలో ఉత్సాహంగా సాగుతున్నాయి. 2వ రోజు మంగళవారం బాలికల వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలికల ప్రతిభ అందరినీ అబ్బురపరిచింది. విజేతలకు జిల్లా క్రీడల, యువజన శాఖ అధికారి కె.ధనాంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ పాపిరెడ్డి బహుమతులు అందజేశారు. బాలుర వాలీబాల్ పోటీలు బుధవారం కొనసాగనున్నాయి. కాగా ఇప్పటి వరకు పలు విభాగాల్లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 600 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా ఇంటర్ నోడల్ అధికారి రమణి ప్రారంభించిన ఎస్‌జీఎఫ్ పోటీలు బుధవారంతో ముగియనున్నాయి. విజేతలు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో జిల్లా జట్లకు ప్రాతినిథ్యం వహించనున్నారు.

బాలికల వాలీబాల్ విజేతలు

ప్రథమ బహుమతి టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ (ఆలేరు), ద్వితీయ బహుమతి ఎంజేపీటీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ (వలిగొండ), తృతీయ బహుమతి టీజీఎంఎస్ (తుర్కపల్లి)



సంక్షేమ ఫలాలు అర్హులకు అందించాలి

ఎన్‌ఎల్‌ఎం బృందం సభ్యులు సుహాభి, అర్జున్



చందుపట్ల జీపీలో సంక్షేమ పథకాలను సమీక్షిస్తున్న బృందం సభ్యులు సుహాభి, అర్జున్

భువనగిరి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులకు అందించాలని నేషనల్ లెవల్ మానిటరింగ్ (ఎన్‌ఎల్‌ఎం) బృందం సభ్యులు ఎస్.సుహాభి, ఎస్.అర్జున్ అన్నారు. మంగళవారం భువనగిరి మండలం చందుపట్ల గ్రామంలో జిల్లా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఉపాధి హామీ పథకం కూలీల సంఖ్య, తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీ కూలీకి ఉపాధి హామీ పథకం కింద పని కల్పించి వలసలు నివారించాలన్నారు. అదేవిధంగా ప్లాంటేషన్, ఇంకుడుగుంతలు, మరుగుదొడ్ల నిర్మాణం తదితర పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా భువనగిరి మండలవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పథకాల వినియోగంపై శాఖలవారీగా అధికారులతో సమీక్షించారు. సమావేశంలో అదనపు డీఆర్‌డీవో సురేశ్, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, ఎంపీవో ఎం.దినకర్, ఏపీవో బాలస్వామి, ప్లాంటేషన్ ప్రాజెక్టు మేనేజర్ అలీ, ఏపీవో అంజయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

• భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



నాగుల చవితిని జిల్లా వ్యాప్తంగా భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల వద్ద పాలు సమర్పించి మొక్కు చెల్లించి చల్లగా చూడాలని వేడుకున్నారు.

సీఎం, మంత్రులకు కమీషన్లపైనే శ్రద్ధ

మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

యాదాద్రి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను గాలికొదిలేసి... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు కమీషన్లపైనే శ్రద్ధ చూపుతున్నారని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత బూడిద భిక్షమయ్యగౌడ్ ఆరోపించారు. మంగళవారం భువనగిరిలోని బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తోందని, దీంతో రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు మద్దతు ధర కరవైందని ఆరోపించారు. మూసీ పునరుజ్జీవం అంటూ సీఎం రేవంత్‌రెడ్డి యాత్రలు చేపడుతున్నారని, రైతులు, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలకు దిక్కులేదన్నారు. కేటీఆర్ బావమరిది గృహప్రవేశం పార్టీ చేసుకుంటే కూడా రేవంత్ విషం చిమ్మారని ఆరోపించారు. సమావేశంలో రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, భువనగిరి మునిసిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు ఏ.వీ.కిరణ్‌కుమార్, కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భిక్షమయ్యగౌడ్

నీరుండీ.. ఎండుతున్న జీవితాలు

చేపలవి, మత్స్యకార్మికులవి నీటితోనే ముడిపడిన జీవితాలు. నీరుంటేనే మనుగడ. కానీ నాగార్జునసాగర్‌లో నిండుగా నీరుంటే నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీ మత్స్యకార్మికులు ఒక్కపూట తినాల్సిందే. ఇక్కడి మత్స్యకారులు కృష్ణా పరివాహక ప్రాంతంలో చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలకు కృష్ణా పరివాహకంలో చేపల వేట సాగడం లేదు. దీనికి తోడు పర్యాటకుల రాక తగ్గి పూటగడవడమే భారంగా మారిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరుండీ తమ జీవితాలు ఎండిపోతున్నాయంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-నేరేడుగొమ్ము)



వాడపల్లి గ్రామంలో మరపడవలు కలిగిన 11 మందితో పాటు మరో 30మంది చేపల వేట సాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ వృత్తి తప్ప వారికి మరే ఆదాయ మార్గం లేదు. వలలో చిక్కే చేపల విక్రయాలతోనే వారికి భుక్తి. రాత్రీ పగలు వల వేసినా నీటి ప్రవాహ పెరిగి చేపలు పడటంలేదని మత్స్యకార్మికులు వాపోతున్నారు. వలలో చిక్కే ప్రతీ చేపకు డిమాండ్ ఏమీ ఉండదంటున్నారు. వాడపల్లి సమీపంలో ఎక్కువగా రవ్వ, బొమ్మిడాయి, బొచ్చ, చందమామ, బురదమట్టలు దొరుకుతాయని, ఎక్కువగా డిమాండ్ ఉండే కొర్రమీను తక్కువగా చిక్కుతుందని మత్స్య కార్మికులు తెలిపారు. చేపలను స్థానికంగా, మిర్యాలగూడ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. వచ్చే ఆదాయంతో కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. సాగర్ గేట్లు ఎత్తి భారీ వరద వచ్చే సమయంలో కొన్నిరోజుల పాటు చేపలవేట ఉండదంటున్నారు.ఆ సమయంలో కుటుంబాలను వెళ్లదీయడం ఇబ్బందిగా ఉందంటున్నారు. ప్రభుత్వం తమను సబ్సిడీపై ఆధునిక పడవలను అందజేయడంతో పాటు చేపలను హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలించేందుకు వాహనాలను అందించాలంటున్నారు.

కృష్ణమ్మ ఒడిలో పెరిగిన బిడ్డలు వాళ్లు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద కృష్ణా, మూసీ సంగమ ప్రాంతంలో చేపలు వేటకు వెళ్తూ జీవిస్తుంటారు. అదే వారి వృత్తి. వరదసమయాల్లో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారు. నిత్యం కృష్ణా నదిలో ఉండే ఈ మత్స్యకారులు చేపలు పడుతూ జీవనోపాధి పొందడంతో పాటు నీటిలో కొట్టుకుపోయే ఎంతో మంది జీవితాలను కాపాడారు. ఇంత చేస్తున్నా వారి జీవితాల్లో మార్పు రావడం లేదు.

(ఆంధ్రజ్యోతి-దామరచర్ల)

రక్షణలో ముందు వరుస

వాడపల్లిలో కొలువైన మీనాక్షి అగస్త్యేశ్వర-లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ కృష్ణాతీరంలో చేపలు పట్టేందుకు రాత్రీ పగలు తేడాలేకుండా సమయం కుదిరినప్పుడు మత్స్యకార్మికులు వెళ్తుంటారు. దీంతో వారు లేకుండా సంగమ ప్రాంతం కనిపించదు. సంగమ ప్రాంతంకావడంతో శుభ,అశుభకార్యాల కోసం ఇక్కడికి ప్రజలు తరలివస్తుంటారు. పండుగలు, పర్వదినాల్లో భక్తుల రాక మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో నదీ ప్రవాహంలో కొట్టుకుపోవడం, నీటిలోపడితే రక్షించడంలో ముందుంటారు. పుష్కరాలతో పాటు వివిధ పర్వదినాల్లో నదీ స్నానానికి వచ్చే భక్తులను ప్రమాదాల బారి నుంచి కాపాడుతున్నారు. ఇప్పటివరకు 100మందికి పైగానే రక్షించారు. అదేస్థాయిలో నీటి మునిగి చనిపోయిన మృతదేహాలను సైతం వెతికి తీశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



గత 40 ఏళ్లగా కృష్ణానదిలో చేపలను పడుతూ జీవనం సాగిస్తున్నా. ప్రమాద సమయంలో ఇప్పటివరకు ఎంతో మందిని రక్షించాం. వరదల సమయంలో చేపల వేటకు వెళ్లే పరిస్థితి ఉండదు. ఆదాయం లేక జీవితం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం మత్స్యకార్మిక కుటుంబాలను ఆదుకోవాలి.

ఎస్‌కే ఇక్బాల్, మత్స్యకార్మికుడు, వాడపల్లి



వైజాగ్‌కాలనీలో చేపలవేటలేక నిరుపయోగంగా ఉన్న బోట్లు

● పర్యాటకులు లేక బోసిపోయిన వైజాగ్‌కాలనీ ● చేపల వేట లేక ఇబ్బందుల్లో మత్స్యకార్మిక కుటుంబాలు

నదీ తీర ప్రాంతాల్లో వైజాగ్‌కాలనీకి వెళ్లేందుకే ఎక్కువగా పర్యాటకులు ఆసక్తి చూపిస్తుంటారు. స్థానికంగా బోటింగ్‌తో పాటు అక్కడ దొరికే చేపల వంటకాలు కూడా పర్యాటకుల నోళ్లను ఊవిళ్లూరిస్తుంటాయి. సాయంత్రం వేళ నదీతీరంలో చేపలు తింటూ సరదాగా గడుపుతుంటారు. ఈ క్రమంలో నిత్యం పర్యాటకుల తాకిడితో ఉండే వైజాగ్‌కాలనీ ఇప్పుడు బోసిపోయింది. నీటినిల్వతో బోటింగ్‌ను నిలిపివేశారు.అదేసమయంలో పర్యాటకులు సరదాగా గడిపేందుకు స్థలం లేకుండాపోయింది. పర్యాటకులు పర్యటనలకు రావద్దని పోలీస్‌శాఖ కూడా హెచ్చరికలు జారీ చేయడంతో అటు ఉపాధిగా ఉన్న చేపల వేట లేక, పర్యాటకుల రాక తగ్గి మత్స్యకార్మికులకు ఆదాయం పూర్తిగా పడిపోయిందని, పూటగడవటం కూడా కష్టంగా మారిందంటున్నారు.

ఉపాధి లేక వలసలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ పెరిగి చేపల వేట నిలిచింది. చేపలు వరద సమయంలో ఎదురు ఈదుతూ వెళ్తుంటాయి. ఈ క్రమంలో వలకు చేపలు పడటం లేదు. ఒక్కో రోజు వలలో రెండు కిలోల చేపలు కూడా చిక్కడం లేదంటున్నారు మత్స్యకార్మికులు. గ్రామంలో 200 కుటుంబాలు చేపల వేటమీదే ఆధారపడి జీవిస్తుంటాయి. ఆగస్టు నుంచి సాగర్‌కు వరద మొదలైందని మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా కుటుంబాలు ఉపాధి కోసం వలస వెళ్లాయంటున్నారు. నీటినిల్వ తగ్గే వరకు చేపలు లభ్యమయ్యే పరిస్థితి ఉండదని, అప్పటి వరకు కృష్ణా నదిలో పర్యాటకులను తిప్పడానికి బోట్లకు అనుమతి ఇచ్చి ఆదుకోవాలని మత్స్యకార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.



● పర్యాటకులను తిప్పేందుకు బోట్లకు అనుమతి ఇవ్వాలి



కృష్ణా పరివాహక ప్రాంతంలో పర్యాటకులు తిప్పేందుకు బోట్లకు అనుమతి ఇవ్వాలి. బోట్లకు అనుమతి ఇస్తే పర్యాటకుల రద్దీ పెరుగుతుంది. దీంతో తమకు జీవనోపాధి కలుగుతుంది. చేపలవేట లేక ఇబ్బందుల్లో ఉన్నాం.

చేపల నిరీక్ష, వైజాగ్‌కాలనీ

● పూటగడవడమే భారమైంది



కృష్ణానదిలో నీటిప్రవాహం పెరిగి వలలు వేసినా చేపలు ప్రవాహనికి కొట్టుకుపోతున్నాయి.రెండు, మూడు కిలోలు కూడా పడడంలేదు. దీంతో పూటగడవడం భారమైంది. పర్యాటకులను తిప్పేందుకు బోట్లకు అనుమతి ఇస్తే ఉపాధి దొరుకుతుంది.

కోట జగ్గు, మత్స్యకారుడు, వైజాగ్‌కాలనీ.

ఓట్ల నమోదుకు నేడే ఆఖరు

(3వ పేజీ తరువాయి)

ఓటుహక్కు కోసం నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు సైతం మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈసారి జరిగే ఎన్నికలకు ఓటర్ల సంఖ్య పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని మేనేజ్‌మెంట్ల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల ఉపాధ్యాయులకు సైతం ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాలు ఓట్ల నమోదు కోసం అవగాహనతో పాటు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. దీంతో పాటు పలువురు అభ్యర్థులు ప్రచారం కూడా ప్రారంభించారు. 2019 ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 20,888 ఓట్లు నమోదయ్యాయి. ఇంకా ఓట్ల నమోదుకు మరో రోజు గడువు ఉన్నందున్న వీటి సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

మంగళవారం నాటికి
మూడు ఉమ్మడి జిల్లాలో ఓట్ల నమోదు ఇలా...

జిల్లా	మండలాలు	వచ్చిన దరఖాస్తులు
సిద్ధిపేట	04	128
నల్లగొండ	33	3,886
సూర్యాపేట	23	2201
యాదాద్రి	17	874
జనగాం	12	645
మహబూబాబాద్	18	988
వరంగల్	13	1818
హనుమకొండ	11	3664
భూపాలపల్లి	07	196
భద్రాద్రి	23	1496
ఖమ్మం	21	2873
ములుగు	09	342
మొత్తం	191	19,111

8న టెండర్ కం బహిరంగ వేలం

కనగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయం ఈనెల 8 తేదీన వివిధ వస్తువుల విక్రయ హక్కుల కల్పించేందుకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఏడాది కాలానికి వివిధవస్తువులకు సంబంధించి వేలం జరుగుతుందని ఆసక్తి గల వారు ఎల్లమ్మ ఆలయం పేరిట ఏదేని జాతీయ బ్యాంకులో డీడీ తీసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. టెండర్‌కు సకాలంలో హాజరుకావాలన్నారు. అదేవిధంగా బుధవారం హుండీకానుకలు లెక్కిస్తున్నట్లు ఈవో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల వద్ద పూజలు చేసి పాలు పోశారు. నల్లగొండలోని పానగల్ రోడ్డులోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నాగదేవత పుట్ట వద్ద మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టలో పాలు పోశారు. యాదాద్రి జిల్లా , సూర్యాపేట జిల్లాలోని పలు ఆలయాల్లోనూ భక్తుల సందడి కనిపించింది.

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)



సూర్యాపేటలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



నల్లగొండలో నాగదేవత విగ్రహానికి పాలుపోస్తున్న మహిళలు





సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మరలో నాగదేవతల విగ్రహాలకు పూజలు చేస్తున్న మహిళలు, నల్లగొండ జిల్లా వేములపల్లిలో నాగదేవత విగ్రహంపై పాలుపోస్తున్న భక్తులు

గుట్టను తవ్వి.. దారిని చేసి

● సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర కోసం చకచకా ఏర్పాట్లు

వలిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఈ నెల 8వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. సీఎం పాదయాత్ర నేపథ్యంలో మూసీ పరివాహకంలోని సంగెం పరిధిలోని గుట్టను తవ్వి మట్టిని తరలించారు. మూసీ ప్రాంతానికి ఇరువైపులా మట్టిని పోసి చదునుచేశారు. పాదయాత్రకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.





సీఎం పాదయాత్ర కోసం సంగెం సమీపంలోని గుట్ట వద్ద దారి కోసం ఎక్స్‌కవేటర్‌తో కొనసాగుతున్న తవ్వకాలు



కనగల్‌లో కొనసాగుతున్న బాలుర విభాగంలో పోటీ

ముగిసిన ఉమ్మడి జిల్లా ఖోఖో సెలక్షన్ పోటీలు

● 24 మంది బాల, బాలికల ఎంపిక

కనగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-19 బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపిక పోటీలు ముగిశాయి. బాలుర విభాగంలో 120 మంది, బాలికల విభాగంలో 130 మంది పాల్గొనగా, 24 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 8, 9, 10 తేదీల్లో సికింద్రాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్ల నుంచి పాల్గొననున్నారు. అంతకుముందు పోటీలను డీఐఈవో దస్రూనాయక్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీల్లో ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మ, మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ థామస్, మమత, పీడీలు నర్సిరెడ్డి, విజయ్, పాఠశాల ఉపాధ్యాయులు రాజు, భద్రయ్య, జగదీష్, అక్కినేపల్లి శ్రీనివాస్, రాజేందర్, సుమధుర గ్రూప్స్ ప్రతినిధి నర్సింగ్ మురళీగౌడ్, బొడ్డుపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దస్రూనాయక్

రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా కిరణ్‌ప్రసాద్



నల్లగొండ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన తడక కిరణ్‌ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ నెల 15వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలోని రాధా కృష్ణా స్టేడియంలో నిర్వహించే 14వ జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 31 హాకీ జట్లు పాల్గొంటున్నాయి. రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా కిరణ్‌ప్రసాద్ ఉండనున్నారు. ప్రస్తుతం ఆయన ప్రస్తుతం ఇండియన్ ఆర్మీ హాకీ టీం కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మాసాయిపేట విద్యార్థిని



విద్యార్థిని హిందును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

యాదగిరిగుట్టరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట విద్యార్థిని వల్లపు హిందు ఎంపికైంది. ఉమ్మడి జిల్లా జట్టు తరుపున హిందు ఈ నెల 7వ తేదీ నుంచి తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో నిర్వహించే అండర్-14 పోటీల్లో పాల్గొననున్నట్లు మాసాయిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం మల్లికార్జున్ తెలిపారు. ఆయనతో పాటు పీఈటీ చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందం హిందును అభినందించింది.

ఎంజీయూ రిజిస్ట్రార్‌గా అల్వాల రవి



నూతన రిజిస్ట్రార్ అల్వాల రవిని అభినందిస్తున్న అధికారులు, ఉద్యోగులు

నల్లగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకులు అల్వాల రవిని నియమిస్తూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రతీ అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించి అంకితభావంతో పనిచేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. మొదటిసారిగా ఎంజీయూ అధ్యాపకుడికి అవకాశం రావడం ఎంతో సంతోషకరమని, సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న దృష్ట్యా మరింత ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన రిజిస్ట్రార్ అల్వాల రవిని, ప్రిన్సిపాళ్లు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

బోరింగ్‌తండాలో మద్యనిషేధంపై తీర్మానం



గ్రామంలో మద్యనిషేధం విధించుకుంటూ చేసిన తీర్మానాల కాపీలను చూపిస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు(ఎస్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతమైన తండాలో మద్యం మహమ్మారి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేస్తుందని, అందుకే తమ గ్రామాల్లో మద్యం నిషేధించాలని సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో పల్లెలు ఒక్కొక్కటిగా ప్రతినబూనుతున్నాయి. మొన్నటి వరకు మండలంలోని మూడు గ్రామాల్లో మద్యం నిషేధం అమలుకు తీర్మానించగా మంగళవారం బోరింగ్‌తండాలో మద్యపాననిషేధం అమలుకు తీర్మానించారు. వివిధ సామాజిక, రాజకీయ వర్గాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో సమావేశమయ్యారు. గ్రామంలో మద్యం దుకాణాలు మూసివేయాలని అఖిలపక్షాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇక నుంచి మద్యం విక్రయించడం, తాగడం చేయవద్దంటూ ప్రతిజ్ఞ చేశారు. బోరింగ్‌తండాలో మద్యం విక్రయించినా, తాగినా జరిమానా విధిస్తామని, ప్రతీ రాజకీయ పార్టీల కులసంఘాలు, యువజన సంఘాల నుంచి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని ఉద్యమాన్ని కొనసాగించాలని తీర్మానించారు. గ్రామాల్లో మద్యనిషేధం చేసుకోవడం సంతోషకరమైన శాంతియుతంగా ఉద్యమాలు చేసుకొని గ్రామాల్లో అభివృద్ధి పరుచుకోవాలని సూచించారు. కిరాణాషాపులు మరే విధమైన ప్రాంతాల్లో గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గుగులోతు గణేష్, చాంప్లా, కుమార్, సురేందర్, శ్రీనివాస్, శేఖర్, వీరన్న, ప్రేమ్‌కుమార్, నందు, పార్వతీ, పద్మ, బుజ్జి, చంద్రకళ, కల్పన, మంజుల పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మోతె, నవంబరు 5: విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయుడు మద్యం మత్తులో పాఠశాలకు వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో పాఠశాల ఆవరణలోనే నిద్రించాడు. సోమవారం సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని రాంపురంతండాలో ఈ ఘటన జరిగింది. గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సదరు ఉపాధ్యా యుడిపై మంగళవారం సస్పెన్షన్ వేటు పడింది. ఎంఈవో గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మామిళ్లగూడెం గ్రామానికి చెందిన నవిలే ఉపేందర్ రాంపురంతండాలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. భార్య మృతి చెందినప్పటి నుంచీ నిత్యం మద్యం మత్తులో పాఠశాలకు వస్తుండడంతో రెండేళ్ల క్రితం ఇదే తండావాసులు జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. అప్పుడు సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయుడు ఆరు నెలల క్రితం విధుల్లో చేరారు. సోమవారం కూడా మద్యం మత్తులో పాఠశాలకు వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో పాఠశాల ఆవరణలోనే నిద్రించటంతో గ్రామస్థులు జిల్లా విద్యాశాఖ అధికారికి ఆ ఫొటోలను పంపి ంచారు. విచారణ చేసిన ఉన్నతాధికారులు ఉపేందర్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం గ్రామస్థులు, విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి

కోదాడ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కోదాడ మండల పరిధిలోని కూచిపూడితండాలో మంగళవారం జరిగింది. రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డి మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తండాకు చెందిన తేజావత్ సాయిభగవాన్ (24) కోదాడ పట్టణంలోని ఓ పూల దుకాణంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి సుమారు 11గంటల సమయంలో తను పనిచేసే దుకాణం వద్దకు బాలాజీనగర్‌కు చెందిన పవన్, నందూలాల్, సిద్ధు, నవీన్, కూచిపూడితండాకు చెందిన సాయి, ఇంకా కొంతమంది వచ్చి పవన్ చెల్లెల్ని ప్రేమ పేరుతో వేధిస్తున్నావని ఆ విషయంలో మాట్లాడుదామని పిలిపించారని ఎస్ఐ తెలిపారు. సాయి భగవాన్, అతని స్నేహితుడు ప్రకాశ్ ఒకే బండిపై కోదాడలోని హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే వైవారందరూ సాయి భగవాన్‌పై దాడి చేశారు. దీంతో సాయిభగవాన్ కూచిపూడితండాకు వచ్చి అవమానభారంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతనిని కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. సాయిభగవాన్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్‌పై వ్యక్తి దాడి


చికిత్స పొందుతున్న అసిస్టెంట్ లైన్‌మన్

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్‌పై ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ సంఘటన మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జగత్‌పల్లిలో జరిగింది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అసిస్టెంట్ లైన్‌మెన్ గుగులోతు వెంకటేష్ జగత్‌పల్లి గ్రామంలో మంగళవారం కరెంటు మీటర్ రీడింగ్ చేస్తున్నాడు. గ్రామంలోని బింగి ఈశ్వర్ ఇంటికి మీటర్ రీడింగ్ చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి ముందున్న కుక్క తనని కరవడానికి రాగా, తన వద్ద ఉన్న కటింగ్ ప్లేయర్‌తో కుక్కను కొట్టడంతో అది అరుస్తూ ఇంట్లోకి వెళ్లింది. తన కుక్కను కొట్టావని అయితే ఇంటి యజమాని ఈశ్వర్ ఆగ్రహంతో దాడి చేశాడని అసిస్టెంట్ లైన్‌మెన్ బోరున విలపించాడు. అంతేగాక తనను కులం పేరుతో దూషించాడని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తన సహచర సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు.


మహిళ గొంతుకోసిన గుర్తుతెలియని వ్యక్తి

కోదాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మహిళపై దాడి చేసి గొంతు గోసి పరారయ్యాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో మంగళవారం జరిగింది. పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో నివాసంటున్న ఎస్. రేణుక ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి మహిళను గొంతుకోశారు. దీంతో ఆమె అరుపులు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి పరారయ్యాడు. గాయపడిన రేణుకను స్థానికులు నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్టు

మేళ్లచెర్వు, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రానికి ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరా చేస్తూ 250 గ్రాముల గంజాయితో ఈ నెల 2వ తేదీన సింహాద్రి, నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మండల కేంద్రానికి చెందిన యామపంగు మహేష్, మంగలపల్లి సింహాద్రి, బుస్కా నరేష్‌లను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు కళేబరం

నాగారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మేత కోసం వెళ్లిన కాడెద్దు ట్రాన్స్‌పార్మర్ ఎర్త్‌వైరుకు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో మంగళవారం జరిగింది. ఆకుల నాగయ్య వ్యవసాయ క్షేత్రంలో కాడెద్దులను మేపుతుండగా మేతకోసం వెళ్లిన కాడెద్దు ట్రాన్స్‌పార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని రైతు నాగయ్య తెలిపాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పెద్దగుమ్మడం గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన మస్క వెంకటయ్య(35) కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఊరు చివరన గల బత్తాయి తోటలో గల మామిడి చెట్టుకు ఉరి వేసుకొని విగతజీవిగా వేలాడూ ఉన్నాడు. మంగళవారం మధ్యాహ్నం బత్తాయి తోట యాజమాని తిలారి వెంకటమ్మ తోట వద్దకు వెళ్లింది. అక్కడ చెట్టుకు వేలాడూ వ్యక్తి కనిపించడంతో భయపడిన ఆమె వెంటనే గ్రామంలోకి పరుగెత్తుకు వచ్చి గ్రామస్థులకు విషయం చెప్పింది. వారు వెంటనే వెళ్లి చూసి గుడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వెంకటయ్య మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సెంట్రింగ్ పనికి వెళ్లి..

నల్లగొండ, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ పట్టణంలో నివాసముంటున్న పొనుగోటి నాగేశ్వర్‌రావ్(35) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నల్లగొండ పట్టణంలోని కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో షంషానగర్‌లో నివాసం ఉంటున్నాడు. తిప్పర్తి డిప్యూటీ తహసీల్దార్ కొత్త ఇంట్లో పనిచేస్తూ కింద పడడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. నాగేశ్వరరావు సోదరుడు వెంకటేశ్వరావ్ ఫిర్యాదు మేరరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెంచులకు ఏదీ చేయూత

స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు గడిచినా చెంచుకుల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు రావడం లేదు. ఇంకా సాంప్రదాయ వృత్తులే ఆదాయ వనరులుగా ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. అటవీ ఉత్పత్తులను సేకరించి, వాటిని విక్రయించగా వచ్చిన ఆదాయంతోనే కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. నల్లగొండ జిల్లా డిండి మండలంలోని చెంచులను నాలుగు దశాబ్దాల కిందటే గుర్తించి ప్రభుత్వం అరకొర సౌకర్యాలు కల్పించి చేతులు దులుపుకుంది. .

(ఆంధ్రజ్యోతి-డిండి)


గోనబోయినపల్లిలో ఒకే ఇంట్లో నివాసముంటున్న జెల్ల గురువయ్య కుటుంబం

నాగరిక సమాజానికి దూరంగా ఉంటున్న చెంచులను గుర్తించి, వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలని 1986లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో మామిళ్లగడ్డ వద్ద అటవీ ప్రాంతానికి సమీపంలో జీవిస్తున్న 17చెంచు కుటుంబాలను గుర్తించింది. అటవీ ఉత్పత్తులతోనే కుటుంబాలను పోషించుకుంటున్న వారిని చేరదీసి డిండి మండలం గోనబోయినపల్లిలో పునరావాసం కల్పించింది. గ్రామంలోని సర్వే నెంబర్ 743, 745లోని వ్యవసాయ భూమిని ప్రతీ కుటుంబానికి 1.20 ఎకరాల చొప్పున కేటాయించింది. అయితే నీటి సౌకర్యం లేని ఈ భూమిని సాగు చేయలేక చెంచులు బీడుగా ఉంచారు. ఇదిలా ఉండగా భూములకు సంబంధించిన పట్టాలను మాత్రం వారి పేరు మీద చేయలేదు. కలెక్టర్ పేరు మీదనే పట్టాలను పంపిణీ చేసింది. అదేవిధంగా 1988లో 17 కుటుంబాలకు పక్కా ఇళ్లను నిర్మించి పంపిణీ చేసింది.

ఇతర ప్రాంతాలకు వలస

చెంచులు అటవీలో లభించే ఉత్పత్తులతోనే ఆదాయాన్ని పొందేవారు. కుందేళ్లను పట్టడం, రోకళ్ల తయారు చేయడం, కుంకుడుకాయలు సేకరించడం, నాగళ్లకు ఉపయోగించే కోలలు తయారు చేసి వాటిని సమీపంలోని గ్రామంలో విక్రయించి నిత్యావసరాలు కొనుగోలు చేసుకునేవారు. గోనబోయినపల్లిలో కేటాయించిన భూమికి నీటిసౌకర్యం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం ప్రారంభించారు. కొందరు చందంపేట మండలం గన్నేర్లపల్లి గ్రామానికి కొందరు వలసలు పోగా మరికొందరు అక్కడక్కడ నివాసం ఉంటున్నారు. చెంచులలో ఒకరైన జెల్ల గురువయ్యకు ఆరుగురు కొడుకులు ఉన్నారు. అందులో నలుగురు వివాహాలు అయ్యాయి. కుటుంబం మొత్తం 20 మందికిపైగా ఉన్నారు. వీరంతా ఒకే ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. ఇలా కుటుంబాల సంఖ్య పెరగడంతో ఇళ్లు సరిపోకపోవడం వంటి కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఈ క్రమంలో వారికి కేటాయించిన ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని చెంచులు కోరుతున్నారు.

కొన్నేళ్లుగా సాగులోకి భూములు

గత పదేళ్లలో కొన్ని సమయాల్లో వర్షాలు అధికంగా కురవడంతో గోనబోయినపల్లిలో కేటాయించిన భూమికి ఎత్తున ఉన్న కానుగచెరువు అలుగు పోస్తోంది. కానుగ చెరువు అలుగుపోసినప్పుడు మాత్రమే కాల్వకు నీరుచేరి పొలాలకు అందుతుంది. చెరువులో నీళ్లు తగ్గితే పంటచేలకు నీరందక ఎండిపోవాల్సిందేనని వారు చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ భూములకు విద్యుత్ ఏర్పాటు చేసి బోరు బావులు తోడించాలని వారు కోరుతున్నారు. సాగు చేయని సమయంలో జీవనోపాధి కోసం చేపల వేట, కుంకుడుకాయల సేకరణ చేపడుతున్నారు. ఈ క్రమంలోనే గురువయ్య ఆయన భార్య నిరంజమ్మ, ఇద్దరు కుమారులు, కోడళ్లు నాలుగు నెలల పసికందును తీసుకొని చేపలవేటకు డిండి వాగులోకి వెళ్లి సెప్టెంబరు నెలలో నీటిలో చిక్కుకున్నారు.

అందని సంక్షేమ ఫలాలు

చెంచులకు కేటాయించిన వ్యవసాయ భూమి కలెక్టర్ పేరున నమోదై ఉంది. దీంతో ఇటీవలి ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న రైతు భరోసా, రైతు బీమా, వ్యవసాయ రుణాలు పొందలేకపోతున్నారు. కుటుంబాల సంఖ్య పెరిగినా ప్రభుత్వం పక్కా గృహాలు కల్పించలేదు. కొందరు శిథిలావస్థకు చేరిన గృహాలను మరమ్మతు చేసుకుని ఉంటుండగా, మరికొందరు కొందరు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. గ్రామంలోనే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నా చెంచుల పిల్లల్లో ఎవరూ చదువుపై ఆసక్తి చూపడంలేదు. వారిని కుటుంబ సభ్యులు తమ వెంటే పనులకు తీసుకెళ్తున్నారు. 17 కుటుంబాలు ఉన్న చెంచులు ప్రస్తుతం 40 కుటుంబాలకు చేరగా వారి జనాభా 120కి పైగా ఉంది. అయినప్పటికీ వీరి కుటుంబాలలో 10వ తరగతి పూర్తిచేసినవారు ఒక్కరూ లేకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా వీరికి రేషన్‌కార్డులు జారీకాకపోవడంతో చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం ఇచ్చే బియ్యం కూడా అందడంలేదు. చెంచులు సరైన పౌష్టికాహారం లేక రక్తహీనతతో బాధపడుతున్నారు.

ఇళ్లులేక అందరం ఒకే ఇంట్లో ఉంటున్నాం



నాకు ఆరుగురు కుమారులు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లతో కలిపి 20 మంది ఉన్నాం. అందరం చిన్నఇంట్లోనే ఉంటున్నాం. ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వాలి. రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేదు. ● జెల్ల గురువయ్య.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	240	270
సూర్యాపేట	రూ.150	220	260
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.60
టీఎంసీలు	303.4310
ఎడమకాల్వకు నీటి విడుదల	5,018
కుడికాల్వకు	9,443
విద్యుత్ కేంద్రం ద్వారా	25,291
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,200 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	35,315 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	41,352 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.89 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	9,30 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	16,000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.65 అడుగులు
టీఎంసీలు	4.11
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	738.46 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	887.95 క్యూసెక్కులు

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

● పోలీసులు సకాలంలో గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగింత

నాగార్జునసాగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేయగా, పోలీసులు రెండు గంటల్లోగా ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం తునికినూతుల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ రమావత్ తిరుపతమ్మ(32) మంగళవారం భర్తతో గొడవ పడి నాగార్జునసాగర్‌కు వచ్చింది. నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీ కొత్త బ్రిడ్జి వద్దకు వెళ్లి ఉంటుందనే అనుమానంతో భర్త లక్పతి వెంటనే నాగార్జునసాగర్‌కు వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం(జీపీఎస్) సాయంతో మహిళ వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా ఆమె ఉన్న ప్రాంతాన్ని తెలుసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామి, హోంగార్డులు సతీష్, రవికునాయక్ అక్కడికి వెళ్లి ఆమెకు నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి తన భార్యను కాపాడిన పోలీసులకు లక్పతి కృతజ్ఞతలు తెలిపాడు.

మాధవరంలో కారు బీభత్సం.. ఒకరు మృతి

మునగాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త నిద్రమత్తుతో కారు నడపడంతో బైక్, పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం గ్రామశివారులో మంగళవారం జరిగింది. మాధవరం గ్రామానికి చెందిన నలగొండ పిచ్చమ్మ(48), ఆమె కుమారుడు నలగొండ నవీన్ (బీటెక్ విద్యార్థి) టీవీఎస్ బైక్‌పై పొలానికి మందు కొట్టేందుకు వెళ్తున్నారు. అదే క్రమంలో ఎల్లాల వెంకన్న, కుమారుడు సతీష్, మన్యం లింగయ్య నడుచుకుంటూ టీవీఎస్‌పై వెళ్తున్న వారితో మాట్లాడుకుంటూ రోడ్డు పక్కనుంచి వెళుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో టీవీఎస్, పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో టీవీఎస్‌పై ఉన్న నలగొండ పిచ్చమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108అంబులెన్స్‌లో సూర్యాపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పిచ్చమ్మ చికిత్సపొందుతూ మృతిచెందింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు క్షేమంగా ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ చిట్యాల వరప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఒంటరితనం భరించలేక..

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంటరితనం భరించలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాతకోటి సైదులు (55) ఆలగడప చేపల చెరువు వద్ద కాపలా కూలీగా పనిచేస్తున్నాడు. అడపాదడపా లక్ష్మీపురానికి వస్తుంటాడు. మంగళవారం ఉదయం గ్రామంలోని రామాలయం వద్ద పురుగుల మందు సేవిస్తూ ఉండడాన్ని గుర్తించిన స్థానికులు సైదులును నిలువరించారు. వెంటనే 108 వాహనంలో మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. సైదులు భార్య 20 సంవత్సరాల క్రితం చనిపోగా, చిన్న కుమారుడు మూడేళ్ల కిందట చనిపోయాడు.

ఒంటరితనంతో బాధప డుతూ మనస్తాపానికి గురై పురుగుమందు తాగినట్లు గ్రామస్థులు తెలిపారు. పెద్ద కుమారుడు యేలేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పొలానికి వెళుతూ నీటిలో మునిగి రైతు మృతి

దేవరకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొలానికి బయలుదేరిన రైతు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడ్డోనితండాకు చెందిన నేనావత్ నరియానాయక్(52)కు గ్రామ శివారులోని మర్రిచెట్టు తండా (మైనంపల్లి వాగు పక్కన) వ్యవసాయ భూమి ఉంది. పొలం పనుల నిమిత్తం మంగళవారం ఉదయం ఇంటినుంచి బయలుదేరాడు. మర్రిచెట్టు తండా వైపు వెళ్లేవారు వాగు పక్కగా ఉన్న డొంక మార్గాన్ని ఎంచుకుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు మైనంపల్లి వాగు నిండి డొంక మార్గంలోకి నీరు చేరింది. అటుగా వెళుతున్న నరియానాయక్ ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయాడు. కొద్ది దూరం కొట్టుకుపోయి విగతజీవిగా పడి ఉన్న నరి యానాయక్‌ను గుర్తించిన పరిసర ప్రాంత రైతులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. నరియానాయక్ మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని దేవరకొండ ఎస్ఐ రమేష్ తెలిపారు. నరియానాయక్‌కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ బుడ్డోనితండాకు వెళ్లి నరియానాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని దేవరకొండ ఎస్ఐ రమేష్ తెలిపారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



ముగిసిన తిరునక్షత్రోత్సవాలు


లక్ష్మీనరసింహస్వామి, ఆళ్వారులను మాడవీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మనవాళ మహాముని తిరున క్షత్రోత్సవాలు అర్చకులు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు మం గళవారం స్వామివారు, ఆళ్వారులకు తిరువీధిలో పుణప్పాట్టు సేవ అర్చకులు చేపట్టి ప్రబంధ పాశురాలను పఠిస్తూ మాడవీధుల్లో ఊరే గించారు. ఈ ఉత్సవాల్లో దేవస్థాన అర్చకులు, పండితులు, ప్రబంధ పారాయణాదారులు, ఆలయ అనువంశిక ధర్మకర్త పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

స్వామివారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో వేద మంత్ర పఠనాలతో పంచామృ తాభిషేకం చేసిన అర్చకులు 1001 తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమ శాస్త్ర రీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్థిని రామ లింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాత గుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 14,42,089ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.

సిమెంట్ పరిశ్రమ రద్దు చేయించిన తర్వాతే

సీఎం జిల్లాలో అడుగుపెట్టాలి

● నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


పెద్దకాపర్తిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాలరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కాలుష్యంతో హాని కలిగించేలా రామన్నపేట శివారులో ఏర్పాటు చేసే సిమెంట్ పరిశ్రమను రద్దు చేయించిన తర్వాతే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో అడుగుపెట్టాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తిలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమ వల్ల ఆయా ప్రాంతాల్లో విపరీతమైన కాలుష్యం వెదజల్లుతుందని ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు వేలాది మంది రైతులు పరిశ్రమతో వ్యవసాయ సాగును కోల్పోతారని, భూముల విలువ కూడా తగ్గుతుందని భూములున్న వారు పెద్దఎత్తున నష్టపోతారన్నారు. ప్రజాకాంక్ష మేరకు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ కోసం ఈ నెల 8న సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాలో పాదయాత్ర చేపట్టి పర్యటించనున్నారని సిమెంటు పరిశ్రమను రద్దు చేయించాకే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో అడుగుపెట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లను మరిచారని విమర్శించారు. ధాన్యాన్ని కొనుగోలు చేపట్టాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రామన్నపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటలో ఏర్పాటు చేయబోయే కాలుష్య కారక సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేసినట్లు ప్రకటించిన తర్వాతనే యాదాద్రి జిల్లాలో సీఎం పర్యటించాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అలంకారంగా ప్రారంభించారు. తప్పా ఇప్పటి వరకు కొనుగోలు జరగడం లేదన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తానంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి చేటుగా మారనున్న సిమెంట్ ఫ్యాక్టరీని కూడా రద్దు చేయాలని అన్నారు. లేని పక్షంలో సీఎం మూసీ యాత్రను అడ్డుకుంటామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

సూర్యాపేటరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యు వకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని రాయినిగూడెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం ద్వారకుంట గ్రామానికి చెందిన షేక్ ఫిరోజ్, శివవరప్రసాద్ కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని రాయినిగూడెం సమీపంలోకి రాగానే ధాన్యం లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో కిందపడిపోయారు. యువకులకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు సూచన మేరకు ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

● గుండాల ఎస్‌ఐ సైదులు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారా అలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్‌ఐ: తహసీల్దార్ పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్ట పరంగా తగిన చర్యలు తీసుకుంటాం. అలాంటి వారిని గుర్తించి ఇటీవల మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలో 15 మంది, అనంతారం గ్రామంలో 11మందిని బైండోవర్ చేశాం.

ఆంధ్రజ్యోతి: నేరాలను అదుపు చేయడానికి..?

ఎస్‌ఐ: మండలంలోని వివిధ గ్రామాలలో నేరాలు అదుపు చేయడానికి గ్రామస్థుల సహకారంతో సీసీ కెమరాలు ఏర్పాటు చేస్తున్నాం. మండలంలోని పాచిల్ల, అనంతారం, బురుజుబావి గ్రామాలలో ఇప్పటికే సీసీ కెమరాలు ఏర్పాటు చేశాం. సుద్దాల, బ్రాహ్మణపల్లి గ్రామాలలో గ్రామస్థులు ముందుకు వచ్చారు.

ఆంధ్రజ్యోతి: గంజాయి, డ్రగ్స్ నివారణకు..?

ఎస్‌ఐ: గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై గ్రామాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, నివారణకు ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నాం.

చేయూత

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా



ఆర్థిక సాయం అందజేస్తున్న ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు

వలిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి అన్నారు. మంగళవారం వెల్వర్తి గ్రామానికి చెందిన ఎర్ర ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులకు ఏజేఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తాం

వలిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హైస్కూల్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు అయిటిపాముల రవీంద్ర తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 70 మందికి షూస్ అందజేశారు. కార్యక్రమంలో మార్నింగ్ అధ్యక్షులు బచ్చు శ్రీనివాస్, ప్రధాన ఉపాధ్యయులు ఆలకుంట్ల శ్రీనివాస్, సభ్యులు వాలీ, బిక్షపతి, రమేష్, స్వామి, శ్రీకాంత్, వెంకటేష్, మహేష్, అనిల్, జగన్, అమరేందర్, విష్ణుష్ వెంకటేశం, మధు, జ్ఞానేశ్వర్, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ABC సమాచారం

నేడు ఎమ్మెల్యే రాక

ఆత్మకూరు(ఎం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవన ప్రారంభోత్సవానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బుధవారం మండల కేంద్రానికి రానున్నారు. ఈమేరకు పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

డీవైఎఫ్‌ఐ నూతన కమిటీ ఎన్నిక

వలిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ ప్రజాతంత్ర యువజన సమాఖ్య మండల కమిటీని మంగళవారం మండల కేంద్రంలో జరిగిన మహాసభలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దాన్యబోయిన యాదగిరి కార్యదర్శిగా కవిడే సురేష్ ఎన్నుకున్నారు. మరో 15మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వడ్డెమాన్ మధు, దేశపాక బాబు, సహాయ కార్యదర్శులుగా రాజు, బీమరాజు, కోశాధికారిగా శ్రీకాంత్ సభ్యులుగా గణేష్, శంకరచారి, ప్రశాంత్, శ్రీకాంత్, సతీష్, మహేష్ ఎన్నికయ్యారు.

13 మంది సభ్యులతో సీపీఎం కమిటీ

చౌటుప్పల్ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీపీఎం చౌటుప్పల్ మునిసిపాలిటీ కమిటీలో 13 మంది సభ్యులతో ఎకున్నట్టు కమిటీ నూతన కార్యదర్శి గోశిక కరుణాకర్ మంగళవారం ప్రకటించారు. కమిటీ సభ్యులుగా ఎండీ.పాషా, బండారు నర్సింహ, దండ అరుణ్ కుమార్, గోపగోని లక్ష్మణ్, ఆకుల ధర్మయ్య, అవ్వారు రామేశ్వరి, బత్తుల దాస్, వి.శ్రీనివాస్, ఎండీ.ఖయ్యూమ్, పర్నే ధర్మారెడ్డి, చింతకింది శారద, టి.మల్లేశం, ఎండీ.రేష్మాను నియమించారు.

శివకుమార్‌కు జీవన సాఫల్య పురస్కారం

భువనగిరి గంజ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి పట్టణానికి చేందిన బుషపాక శివకుమార్‌కు జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. మంగళవారం అరిగపూడి పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదారాబాద్‌లో సందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డు రావడం పట్ల పలువురు అభినందించారు.

కేంద్రాల్లోనే ధాన్యం..రైతు పరిస్థితి దైన్యం

- కొనుగోలు కేద్రాల్లో రైతుల దినచర్య
- ప్రారంభాలు, పరిశీలనలు సరే..కొనుగోళ్లేవీ?
- కలెక్టర్ షోకాజ్ నోటీసులిచ్చినా తీరు మారలే..
- ఇప్పటికే కొంత ధాన్యం దళారుల పాలు





గుండాలలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతు, మోత్కూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న ఆలేరు ఏడీఏ పద్మావతి

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించడానికి రైతులు నానా తిప్పలు పడుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో 15 రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే గుండాలలో మాత్రం ఎట్టకేలకు రెండు రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో అన్నదాతలు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకు వస్తున్నారు. రోజుల తరబడి ఎదురు చూసినా కొనుగోలు కేంద్రాలు సమయానుకూలంగా ప్రారంభించక పోవడంతో ఇప్పటికే సగం మంది రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన ధాన్యాన్ని తూకం వేయడానికి మ్యాచర్ రాకపోవడంతో అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. మరోవైపు ప్రతీ రోజు మబ్బులు వస్తుండడంతో మళ్లీ వర్షం ఎక్కడ పడుతుందో నని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాల్లోకి తీసుకు వచ్చిన ధాన్యాన్ని ప్రతి రోజు ఉదయం పూట ఎండబోసి సాయంత్రం సమయంలో కుప్ప పోయాల్సి వస్తోంది.

మోత్కూరు/ గుండాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సుమారు పది రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభాలు, అధికారుల పరిశీలనలే తప్ప కొనుగోళ్లు మాత్రం జరగడం లేదని రైతులు పేర్కొంటున్నారు. మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల మండలాల్లో వరి కోతలు ప్రారంభమైన వెంటనే ప్రభు త్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఇప్పటికే 60 శాతం మంది రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.2320 ఉండగా, ప్రైవేటు వ్యాపారులు పచ్చి ధాన్యం (తూర్పార బట్టకుండా, ఆరబెట్టకుండా) రూ.2వేల నుంచి 2050కి కొంటున్నారు. ధాన్యం ఆరబెట్టి, తూర్పారబట్టడానికి డబ్బు ఖర్చు చేయడం, ఆరబెడితే క్వింటాకు కనీసం ఆరేడు కిలోలు తగ్గడం, కేంద్రంలో పోసి రోజుల తరబడి వేచి చూడడమెందుకని ఎక్కువ మంది రైతులు పచ్చి ధాన్యాన్నే ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కొద్ది మంది రైతులు ధర ఎక్కువ వస్తుందని కేంద్రాలకు తెస్తుండగా ఆ కొద్దిపాటి ధాన్యాన్ని కూడా ఇంత వరకు కొనడంలేదు.

మోత్కూరు మండలంలో..

మోత్కూరు మండలంలో రైతు సేవాసహకార సంఘం ఆధ్వర్యంలో ఆరు కేంద్రాలు తెరవగా అనాజిపురం, దత్తప్పగూడెం, కప్రాయపల్లి కేంద్రాలకు ధాన్యమే రాలేదు. మోత్కూరు కేంద్రంలో సుమారు 17 సన్నధాన్యం రాశులు ఉన్నాయి. పొడిచేడు, రహీంఖాన్‌పేటలో కొద్ది రాశులు ఉన్నాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 4 కేంద్రాలు తెరవాల్సి ఉండగా సదర్శాపురంలో కల్లం, ధాన్యం లేదని, దాచారంలో కేవలం 3 రాశులే ఉండటంతో రెండు చోట్ల కేంద్రాలు ప్రారంభించలేదు. పాటిమట్ల, ముశిపట్లలో కేంద్రాలు ప్రారంభించారు. గుండాల మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఒకటి, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 8 కేంద్రాలు ప్రారంభించారు.

అడ్డగూడూరు మండలంలో..

అడ్డగూడూరు మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏడు కేంద్రాలకు గాను మూడు కేంద్రాలు ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఐదు కేంద్రాలు ప్రారంభించారు. అన్ని కేంద్రాల్లోనూ కొద్దికొద్దిగానే ధాన్యం రాసులు ఉన్నాయి. ఈ మూడు మండలాల్లో ఇంతవరకు ధాన్యం కొనడం ప్రారంభం కాలేదు. ఈ నెల 1న కలెక్టర్ హనుమంతరావు మోత్కూరు, గుండాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించి వెంటనే ధాన్యం కొనాలని ఆదేశించారు. ఈ నెల 4న గుండాల మండల ప్రత్యేక అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, ఈ నెల 5న మోత్కూరులో ఆలేరు ఏడీఏ పద్మావతి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అయినా ఇంత వరకు కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో కొనుగోలు కేంద్రాల ప్రారంభాలు, అధికారుల పరిశీలనలే తప్ప కొనుగోళ్లేవని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనాలని రైతులు కోరుతున్నారు.

● మోత్కూరు కేంద్రంలో ధాన్యం కొనుగోలులో ఎందుకు జాప్యం జరుగుతోందని రైతుసేవా సహకార సంఘం సీఈవో కె.వరలక్ష్మీని అడగ్గా రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు కానీ తూర్పార పట్టడం లేదని తెలిపారు. తేమ శాతం 17 ఉన్నా, తూర్పార పట్టక పోవడంతో ధాన్యంలో తాలు, గడ్డిపోచలు ఉండటంతో కొనడం లేదని, తూర్పార పట్టిన వెంటనే కొనుగోలు చేస్తామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోత్కూరు మండలంలోని పాలడుగు గ్రామంలో మత్స్యగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆ సంఘం చైర్మన్ వల్లపు సైదులు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం సీఈవో నర్సింహాచారి, మాజీ సర్పంచ్ మర్రిపల్లి యాదయ్య, యాస మాధవి, గోవిందు, బక్కయ్య, మచ్చగిరి, ప్రభాకర్, ముత్తయ్య పాల్గొన్నారు.

పరిశీలించిన ఆలేరు ఏడీఏ

మోత్కూరు మార్కెట్ యార్డులో స్థానిక రైతు సేవా సహకార సంఘం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం రాశులను ఆలేరు ఏడీఏ పద్మావతి, సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. కేంద్రానికి పూర్తిగా సన్నధాన్యమే ఇచ్చింది. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలననుసరించి ధాన్యం కేంద్రాలకు తీసుక రావాలన్నారు. ఏవో వి.కీర్తి, సంఘం సీఈవో కె.వరలక్ష్మీ, ఏఈవో టి.గోపీనాథ్, సిబ్బంది కిషన్, సురేష్, సందీప్, శ్రీకాంత్ ఉన్నారు.

ధాన్యాన్ని శుభ్ర పరచి, తూకాలకు సిద్ధంగా ఉంచాలి

చౌటుప్పల్ టౌన్/ చౌటుప్పల్ రూరల్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని శుభ్ర పరచుకొని తూకాలకు సిద్ధంగా ఉంచుకోవాలని చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి రైతులను కోరారు. చౌటుప్పల్, తాళ్ల సింగారం, పంతంగి, అంకిరెడ్డి గూడెం, గుండ్లబావి, ఎస్ లింగోటం, నేలపట్ల, మందోళ్లగూడెం తదితర కొనుగోలు కేంద్రాలను మంగళవారం దామోదర్ రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర ను పొందాలని, మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. సెక్రటరీ వై.రమేష్ ఉన్నారు.

గింజ ముట్టలే..తూకం వేయలే



గుండాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ (ఫైల్ ఫొటో)

గుండాల మండలంలోని 20 గ్రామ పంచాయితీలకు గాను 10 పిఏసిఎస్, 8 ఐకేపీ కేంద్రాలు ఉండగా ఇప్పటికీ మండలంలోని వెల్మజాలలో మాత్రమే ఐకేపీ కేంద్రాన్ని, 8 పీఏసీఎస్ కేంద్రాలను ప్రారంభించారు. మిగతా గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు తప్పని పరిస్థితిలో ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ధాన్యం కొనుగోలు వేగ వంతం చేయాలని కలెక్టర్ ఈ నెల3న గుండాల మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి పీఏసీఎస్ సీఈవో, ఏఈవోకు షోకాజ్ నోటీసులు ఇచ్చినప్పటికీ అధికారుల తీరు మారడం లేదని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరుకుంటున్నారు.

కొనుగోలు కేంద్రం లేక ప్రైవేటుకు విక్రయించాను



సీతారాంపురం గ్రామంలో ప్రతీ సంవత్సరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కోతలు ప్రారంభమయ్యేనాటికి ప్రారంభించేవారు. ఈ సంవత్సరం కోతలు ప్రారంభమయ్యి నెల కావస్తున్నా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించ లేదు. వాతావరణ పరిస్థితులు, ధాన్యం మ్యాచర్ కోసం ఎండబోసేందుకు, తూర్పారపట్టేందుకు చాలా శ్రమ, వ్యయంతో కూడిన పని. తప్పని పరిస్థితిలో ధర తక్కువ అయినప్పటికీ ప్రైవేటు వ్యాపారులకు విక్రయించినాను.

- మచ్చ కృష్ణారెడ్డి, సీతారాంపురం, గుండాల మండలం

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



ఆలేరులో ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు

భువనగిరి రూరల్, ఆలేరు, ఆత్మకూరు(ఎం), తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజాపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. వరి ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని నిరసిస్తూ మంగళవారం భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించడంతో రైతులు మధ్యదళారులకు ధాన్యాన్ని విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అదే విధంగా రైతు భరోసా, కౌలు రైతులకు ఆర్థిక భరోసా , రుణమాఫీ రైతులందరికి ఇస్తామని కల్లబొల్లి మాటలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ 9నెలలు గడిచిన అమలు కాకపోవడం సరికాదన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రత్నపురం బలరాం, చీర్క సురేశ్ రెడ్డి, జెన్నపల్లి శ్యాంసుందర్ రెడ్డి, తాడూరి బాల శంకర్, వల్దాసు రాజు కాళభైరవ, నాగు వినోద్, యాట వెంకట్, నరాల శ్రీను, మాటూరి అనిల్, పనుమటి మాణిక్యం రెడ్డి,లక్ష్మణ్, క్యాసాని శ్రీనివాస్, రమేశ్, మల్లికార్జున్, మాటూరి అంజనేయులు పాల్గొన్నారు.

● ఆలేరులో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల పట్టణ అధ్యక్షుడు పూజారి కుమారస్వామి, నందా గంగేష్, నాయకలు బందెల సుబాష్ అంజనేయులు, బడుగు జహంగీర్, కామిటికారి క్రిష్ణ, తునికి దశరథ, లక్ష్మీ, నర్సింహారెడ్డి, తోట మల్లయ్య, బోగ శ్రీనివాస్, ఎం.రాజు, కాంతి రవి, టి.రాజు పాల్గొన్నారు.

● ఆత్మకూరు(ఎం)లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జి.కాశీనాథ్, నాయకులు అంబోజు అంజయ్య, బొట్టు అబ్బయ్య, పాండురంగారెడ్డి, బొబ్బల ఇంద్రారెడ్డి, పైళ్ల ప్రశాంత్, మేడిసాగర్, లోడి వెంకటయ్య, యాస వెంకట్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం)లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

● తుర్కపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లాందాసు కాలభైరవ, మండల అధ్యక్షుడు శత్రునాయక్, నాయకులు యాట పెంటయ్య, ఆకుల భాస్కర్, చిన్న చెల్మయ్య లక్ష్మీనారాయణ, వేణు, సాయికుమార్ పాల్గొన్నారు.

● బొమ్మలరామారం మండలంలో నిర్వహించిన కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీరు రాజేందర్‌రెడ్డి, నాయకులు చిమ్ముల రవీందర్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, ఎల్లాగౌడ్, గోపాల్‌గౌడ్, రవీందర్‌రెడ్డి యువ మోర్చా గుర్రం ప్రవీణ్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

● రాజాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మెండు భగవాన్‌రెడ్డి, ఎర్రగోకుల వినోద్, బూరుగు శేఖర్‌రెడ్డి, దాచెపల్లి శ్రీనివాస్, శివ, ప్రసాద్, శ్రీధర్, వెంకటేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జాప్యం చేస్తే తీవ్ర పరిణామాలు : సీపీఎం

ఆలేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో అధికారులు జాప్యం వహిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని సీపీఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ అన్నారు. ఆలేరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు లేక నిలిచిపోయిన ధాన్యం రాశులను ఆయన మంగళవారం పరిశీలించారు. అధికారుల జాప్యంతోనే కొనుగోళ్లు జరుగక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యాన్ని వీడాలని వెంటనే కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు సత్య రాజయ్య, గణేష్, శంకరయ్య, రాజు, సిద్దులు, సోమయ్య, వీరయ్య, రవి, కిరణ్ ఉన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత వెంకట్‌రెడ్డి

అడ్డగూడూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ డిసెంబరు 26, 1925 వ సంవత్సరంలో కాన్పూరు నగరంలో పార్టీ ఆవిర్భావం జరిగిందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న సీపీఐ తెలంగాణ సాయుధ రైతాంగ పోరటానికి నాయకత్వం వహించి భూస్వాముల గుండెల్లో గుబులు పుట్టించిందని తెలిపారు. అడ్డగూడూరు మండలంలో 600 ఎకారాల భూమిని పేదలకు పంచిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చేడే చంద్రయ్య, ఉప్పుల శాంతికుమార్ ఉన్నారు.

మనోబలంతో ముందుకు సాగాలి



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రీతిస్వరూప్

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు ఎలాంటి ఒత్తిడి లేకుండా, మనోబలంతో ముందుకు సాగాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రీతి స్వరూప్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హరిప్రసాద్, చౌటుప్పల్ హెచ్‌ఈవో ఇస్తారి, చౌటుప్పల్ సబ్‌యూనిట్ ఆఫీసర్ మధుమోహన్, భూదాన్‌పోచంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీవాణి, సిబ్బంది లక్ష్మణ్, సంతోష్‌కుమార్, తులసి, రాజేశ్వరమ్మ, జ్యోతి, శివశంకర్, సాయివర్ధన్, వెంకట్‌రెడ్డి, వెంకటేశం, మంజుల, పర్వీన్ పాల్గొన్నారు.

వైద్య సేవలను పెంచాలి : డిప్యూటీ డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ యశోద

రాజాపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్య సేవలను పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, మెటర్నరీ హెల్త్ అండ్ న్యూట్రీషన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎల్.యశోద కోరారు. మంగళవారం రాజాపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గర్భిణుల నమోదులు పెంచాలని సూచించారు. సాధారణ ప్రసవాలను పెంచి, నవజాత శిశువుకు అవసరమైన ప్రత్యేక సేవలు అందించాలన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ భరత్‌కుమార్, వసంత, విజయలక్ష్మీ ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శ్యాంసుందర్

రాజాపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం రాజాపేట మండలంలోని పాముకుంట ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేక అధికారి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అమలు తీరు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సమీక్షించారు. అనంతరం మండలంలోని రేణికుంట, రఘునాధపురం, బేగంపేట, రాజాపేట గ్రామాల్లోని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్, ఎంపీవో కిషన్, ఏఈవో ప్రిణీత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భూదాన్‌పోచంపల్లి : పెట్టుబడీదారి వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలందరూ సంఘటితం కావాలని సీపీఎం కార్యదర్శి ఎండీ.జహంగీర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దోతిగూడెం గ్రామంలో సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, గూడూరు అంజిరెడ్డి, ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డి, అందెల జ్యోతి పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లలో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. చౌటుప్పల్ పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో కుల గణనపై కార్యకర్తలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.

చౌటుప్పల్ టౌన్ : ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆందోళ్ మైసమ్మ లోకల్ ఆటో యూనియన్ అధ్యక్షుడు పొండాల మల్లేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్, ఎట్టయ్య, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలేరు: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని ఉద్యమాలు నడిపించిన పీడీఎస్‌యూ అధినేత జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్‌ను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ పేరిట కాల్చి చంపించదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డం నాగరాజు, బేజాడి కుమార్ అన్నారు. ఆలేరులోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన జంపాల 50వ వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడారు.

యాదగిరిగుట్ట రూరల్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మెతుకు సైదులు పిలుపునిచ్చారు. గుట్ట మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. అయిలి హరిశంకర్, కె.వెంకన్న, నారాయణ, కృష్ణారెడ్డి ఉన్నారు.

ఆత్మకూరు(ఎం : రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలిగించకుండా ధాన్యం కొనగోలు చేయాలని తహసీల్దార్ రవికుమార్ నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని సర్వేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

మోటకొండూరు : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆలేరు నియోజకవర్గ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన భూమండ్ల బంగారిని నియమించారున. ఈమేరకు సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ మునిసిపాలిటీలో సమగ్ర కుటుంబ సర్వే కోసం 81 మంది ఎమ్యూనరేటర్లు, 8 మంది సూపర్ వైజర్ లను నియమించినట్టు కమిషనర్ కె.నర్సింహారెడ్డి తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం అధనపు ఎమ్యూనరేటరులకు తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు.

భువనగిరి రూరల్: రాష్ట్ర ప్రభుత్వానికి అనుసంధానంగా ఆదర్శ రైతులు క్షేత్ర స్థాయిలో పని చేసి ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించి రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని మండల, పట్టణ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన మొలుగు లక్ష్మయ్య అన్నారు. ఈమేరకు లక్ష్మయ్యను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు పీసీసీ సభ్యులు తంగెళ్లపల్లి రవికుమార్ తెలిపారు.

భువనగిరి రూరల్: గర్భిణులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే తల్లీ, బిడ్డ క్షేమంగా ఉంటారని జిల్లా కుటుంబ సంక్షేమ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వీణ అన్నారు. మంగళవారం భువనగిరి మండలం బొల్లేపల్లి పీహెచ్‌సీలో జరిగిన ఆశాడే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మండల వైద్యాధికారి డాక్టర్ యామిని శృతి, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ సత్యవతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని వంగపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్యరెడ్డి ప్రారంభించారు.

చౌటుప్పల్ రూరల్: యువకులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధుకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మండలంలోని జైకేసా రంలో సంఘం జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పుట్టపాక గ్రామంలో ఐఎన్‌టీయూసీ మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కరెంటోత్ ప్రజ్ఞనాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి కుటుంబ సర్వే

(3వ పేజీ తరువాయి): మిగతా సిబ్బందికి సర్వే విధులు లేకుంటే ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీలను వారు రెండు పూటలా నడిపిస్తారు.

సర్వే సిబ్బందిని పెంచితే బాగుండేది



సర్వే సిబ్బంది సంఖ్యను పెంచితే సర్వే వ్యవధి, సర్వేలో పాల్గొంటున్న సిబ్బందిపై పనిభారం తగ్గుతుంది. అలాగే ఒంటిపూట సెలవులు కూడా తగ్గి విద్యార్థులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం సర్వే సిబ్బంది పెంపుపై పునరాలోచన చేయాలి.

-రేపాక ఉమ, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు

విద్యార్థులకు నష్టం కలగనీయం



సర్వే కారణంగా కొన్ని ప్రాథమిక పాఠశాలలకు ఒంటి పూట సెలవులు ఉంటాయి. అయితే ఉదయం పూట ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లాల్సిందే. రెండు పూటల సిలబస్‌ను ఒక పూటలోనే బోధించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలి. మధ్యాహ్న భోజనం యథావిధిగా విద్యార్థులకు అందుతుంది. ఒంటి పూట సెలవులతో పెండింగ్‌లో ఉండే సిలబస్‌ను విద్యా సంవత్సరం ముగిసే లోపు పూర్తి చేస్తాం.

-సత్యనారాయణ, డీఈవో

పకడ్బందీగా నిర్వహిస్తాం

(3వ పేజీ తరువాయి): చేయాలి. 2011 జనగణన ప్రకారం జిల్లాలో 1,746 ఎన్యూమటరేషన్ బ్లాక్‌లున్నాయి. ప్రస్తుత జనాభా ప్రకారం 1800 బ్లాక్‌లు వచ్చాయి. పదేళ్ల తర్వాత ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి సర్వేలో ఈ నెల 6, 7, 8తేదీల్లో ఇళ్లను గుర్తిస్తారు. ఈ నెల 9వ తేదీ నుంచి ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేపడ్తారు. ఒక్కొక్కరు రోజుకు 10ఇళ్ల చొప్పున 15రోజుల్లో 150ఇళ్లను సర్వే పూర్తి చేయాలి. జనాభా పెరిగినందున ఎన్యూమరేషన్ బ్లాక్‌లోనే 250 ఇళ్లు ఉంటే మొదటి 150ఇళ్లకు ఒకరు. మిగతా 100 ఇళ్లకు ఇంకో ఎన్యూమరేటర్‌ను నియమించి 100/ఎ, 100/బీగా గుర్తిస్తాం.

సర్వే వివరాలన్నీ ఆన్‌లైన్

ఇంటింటి సర్వే వివరాలను ఏ రోజుకారోజు మండలాలవారీగా ప్రణాళిక అధికారుల పర్యవేక్షణలో 10మంది ఆపరేటర్లతో ఆన్‌లైన్ చేస్తాం. మొత్తంగా 20 రోజుల్లో డేటా ఎంట్రీ పూర్తవుతుంది. ఆ తర్వాత సమగ్ర వివరాలను ప్రభుత్వానికి పంపిస్తాం. ఈ సర్వే ద్వారా జిల్లాలోని ఇళ్ల సమాచారంతోపాటు జనాభా, ఇతర వివరాలు అన్నీ స్పష్టంగా తెలుస్తాయి.